

# నా కళ్ళతో నాన్న

– లిపి మల్లాది



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**సాధారణంగా** పాతకాలంలో బ్రాహ్మలు పూజాపాటికలు ఎక్కువగా చేసేవారు. 1923లో జన్మించిన మా నాయనమ్మకి కూడా దైవభక్తి చాలా ఉండేది. ఆవిడ ప్రతీరోజూ మడికట్టుకుని వంటచేస్తూ లక్ష్మీ అష్టోత్రం చదివేవారట. రోజూ పూజ చేసి శుక్రవారంనాడు ఒక కానీ ముడుపు కట్టేవారట. కార్తీకమాసంలో కృష్ణ ఒడ్డున స్నానానికి వెళ్ళినప్పుడు ఒక్కోసారి మా నాన్నని కూడా తీసుకుని వెళ్ళేవారట. నవరాత్రులకి మా నాన్న, నాయనమ్మ, కుటుంబ సభ్యులు కాలినడకన దుర్గగుడికి వెళ్ళేవారట. అలాంటి వాతావరణంలో పెరిగినా మా నాన్న ఏనాడూ మా అమ్మని కొత్త అలవాట్లు చేసుకోమని మాట వరసకి కూడా చెప్పలేదు. పక్కింటి వాళ్ళ అలవాట్లను చూసో, ఎవరో చెప్పిన మాటలను వినో భార్యని అలవాట్లు మార్చుకొమ్మనే భర్తలు ఈ కాలంలో చాలామందే ఉన్నారు. ఇలాంటి కథలను మనం రోజూ చూస్తునే ఉంటాం. కానీ నేను ఇది మా కుటుంబంలో ఎన్నడూ చూడలేదు. మా నాన్న మా అమ్మని అర్థం చేసుకున్నట్టే మా బావ మా అక్క ఊహని అర్థం చేసుకుని సాంప్రదాయ తేడాలు ఉన్నా, వేరే రాష్ట్రానికి చెందినవారైనా ఎన్నడూ ఊహని పద్ధతులు మార్చుకోమని అడగలేదు. ఆ మాటకి వస్తే, తను మా ఊహ అలవాట్లను స్వీకరించి తాను తెలుగబ్బాయిలా ప్రవర్తిస్తూ, మా అమ్మ వండే ఆంధ్రాభోజనానికి వంకలు పెట్టకుండా తింటూ ఆనందిస్తున్నాడు. ఇలాంటివి చూసి, అబ్బాయికోసం మారవలసిన అవసరం లేదనే ఆలోచనలో పెరిగిన నాకు అబ్బాయిని వెతకడం నా తల్లిదండ్రులకు పెద్ద పేచీగా మారినా ఓపికగా ఉన్నారు.

ఆచారుల వంశంలో పుట్టి పెరిగినా మా అమ్మకి పూజలు, వ్రతాలపై నమ్మకం ఏర్పడలేదు. మా అమ్మ మడికట్టుకుని వంటచేయడం నా ఊహకి కూడా చిక్కడంలేదు. ప్రతీనెల మాచవరం ఆంజనేయస్వామికి మా నాయనమ్మ ఆకుపూజ జరిపించేదట. ఒకవేళ చేయించకపోతే కల్లోకి కోతులు రావడంతో ఇలవేల్పుగా కొలిచేవారట. మా నాన్నకి అప్పట్లో భక్తి లేకపోయినా తల్లిపై ప్రేమతో విజయవాడ వెళ్ళిన ప్రతిసారీ మా నాయనమ్మ పేరుపై ఆకుపూజ జరిపించేవారట. తల్లిదండ్రులను కూతుళ్ళు చూసుకున్నంత ప్రేమగా కొడుకులు చూసుకోరని చాలామంది చెప్పడం నేను విన్నాను. "మీకు ముగ్గురు కూతుళ్ళు. ఎంత అదృష్టం" అని మా నాన్నతో చెప్పడం కూడా విన్నాను. కానీ, తల్లిపై ప్రేమను చూపడానికి, వృద్ధాప్యంలో చేరదీయడానికి కొడుకా, కూతురా అన్న తేడా ఉండదు, అది కేవలం

మనసుకి సంబంధించిన విషయమని మా నాన్నని చూసి అర్థం చేసుకున్నాను. మా నాన్న తన తల్లిపై చూపిన ప్రేమానురాగాల్లో సగమైనా నేను నా తల్లిదండ్రులపై చూపగలిగితే వారి రుణం తీర్చుకున్నట్టే.

మా నాన్న వాళ్ళు వైదికులు, అమ్మవాళ్ళు వైఖానసులు అవ్వడంతో ఆ శాఖాబేధాన్ని జీర్ణించుకోలేకపోయినా, కాస్త అసంతృప్తిగానే ఉన్న మా నాయనమ్మ, అమ్మ మధ్య తగాదా ఎప్పుడూ జరగలేదు. పాతకాలంలో సూర్యకాంతంలాకాక మమ్మల్ని పెంచడంలో మా అమ్మ పడేపాట్లను చూసి మా నాయనమ్మ మాకు కబుర్లు చెప్తూ మా అమ్మని పనిచేసుకోనిచ్చేది. ఎప్పుడైనా ఊహకి, మా అమ్మకి గొడవ జరిగితే తాను మధ్యవర్తిగా ఊహని మందలించేది. వయసు పెరిగే కొద్దీ మా అమ్మపై ఆధారపడడం ఆవిడకి అసంతృప్తిని కలిగించినా, హుందాగా బ్రతికినా ఆవిడ మంచంపట్టి అవస్థలు పడినా నేను పలకరించిన ప్రతిసారీ నవ్వుతూనే మాట్లాడేవారు. ఆఖరిరోజుల్లో ఆవిడని చూసుకోవడంలో మాకు సహాయంగా వచ్చిన ఆయా, కాంతమ్మ కూడా ఆవిడ సంతోషానికి కారణమే. 1997లో మా ఇంటికి వచ్చినా నాకు ఊహతెలిసినప్పటి నుండి ఆవిడ మాతో ఉండడం, ఆవిడ పనులను చేస్తూ కాంతమ్మగారు కూడా మా ఇంట్లోనే ఉండడంతో నేను మా కుటుంబ సంఖ్యను ఏడని అందరికీ చెప్పేదాన్ని.

నేను పదవతరగతిలో ఉన్నప్పుడు ఆవిడపోయారు. ఆ రోజు నేను మా నాన్న కళ్ళల్లో మొదటిసారి కన్నీళ్ళు చూసాను. గొప్ప రచయిత అయినా, ముగ్గురు పిల్లల తండ్రి అయినా, ఐదుగురు అక్కల తమ్ముడు అయినా, ఆరోజు మాత్రం మా నాన్న తల్లిని కోల్పోయిన కొడుకు. అది కేవలం భౌతిక దేహమని, ఆత్మకి నాశనంలేదు తిరిగి కలుస్తాము అని ఆయన నాకు చెప్పినా తన కళ్ళల్లో బాధ స్పష్టంగా కనబడుతూనే ఉంది. ఇంటినిండా జనాలు ఉన్నా ఆయన ఒంటరి అనే భావన నాకు కలిగింది. పదేళ్ళ పరిచయానికే నేను అంతగా బాధపడితే జీవితాంతం తోడున్న తల్లిని కోల్పోయిన ఆయన ఇంకెంత బాధపడతారో! అలాంటి కష్టం పగవాడికి కూడా రాకూడదు. శోకంలో మునిగిపోయినా ఇంటికి వచ్చిన బంధువుల అవసరాలను జరగవలసిన కార్యక్రమాలను దగ్గరుండి చూసుకుని, తనగుండెలో ఉన్న విచారం పరులకు సోకకుండా, తన రచనలకై వేచి చూస్తున్న పత్రికల నుండి సెలవుతీసుకోకుండా, అన్నిటినీ జరగాల్సిన పద్ధతిలో జరిపిస్తూ, కుటుంబానికి అండగా నిలిచి, ఆయనంత ధైర్యంగా ఎవరూ ఉండలేరని చెప్పడంలో తప్పులేదు. ఆవిడ మాతో లేరనే నిజాన్ని జీర్ణించుకోవడానికి మాకు కొన్ని నెలలు పట్టింది. ఉదయానే "కాఫీ కావాలా?" అని అడగడం, "నాయనమ్మకి ఏమైనా కావాలేమో చూడు" అని రాసుకుంటూ మా అమ్మ నాకు చెప్పడం, ప్రతీవారం మా ఇంటికి వచ్చి నాయనమ్మతో మాట్లడినట్లే మా నాన్న చెల్లి ఉష ఇంటికి రావడం, మొదలగు విషయాలు చాలా జరిగాయి. నాకు గుర్తున్నంత వరకు కొన్ని వారాలపాటు మా నాన్న ఆ ఖాళీ గదిలోకి వెళ్ళడానికి ఇష్టపడలేదు. అలవాటులో వెళ్ళినా తిరిగి బయటికి వచ్చేసరికి ఆయన ముఖంలో బాధ ఉట్టిపడేది. అంత విషాదాన్ని గుండెల్లోనే దాచుకుని, ఆయనంత ధైర్యంగా ఉండడం ఎవ్వరి తరంకాదు. అంతక్షోభ నాకే వస్తే నేను తట్టుకోలేక నా గుండె పగిలేది. ఈ విషయంలో నాకు మా నాన్న పోలిక వచ్చి ఉంటే బావుండేది అనిపిస్తుంది.

చిన్నతనంలో మా నాయినమ్మ, కాంతమ్మలతో కలిపి మా కుటుంబ సంఖ్య ఏడు అన్నట్టుగా, పెద్దయ్యాక ఊహపిల్లి క్వెంటెల్, తన భర్త యొక్క కుక్క పిల్ల స్కాచ్‌తో కలిపి మా కుటుంబ సంఖ్య తొమ్మిదైంది. అవి రెండూ పెంపుడు జంతువులే అయినా మా దృష్టిలో అవి మా కుటుంబానికి చెందిన జీవాలు. ఎంత అల్లరి చేసినా, వస్తువులను ధ్వంసం చేసినా వాటిపై కోపం కన్నా ప్రేమే ఎక్కువ కలుగుతుంది. మొన్న డిసెంబర్‌లో నేను ఊహ వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు క్వింటెల్ బయట చలిలో కొంచెంసేపు ఉండేసరికి ఆ వాతావరణం పడక జ్వరం వచ్చింది. ఇల్లంతా తిరుగుతూ సందడిగా ఉండే క్వింటెన్ తిండి, నీరు లేకుండా ఓ గదిలో పడుకోవడం చూసి మా అందరి కడుపు తరుక్కుపోయింది. మరుసటిరోజు మా అమ్మా నాన్నా తనపై ఓ కన్నేసి, సమయం గడిపినా తినకపోవడంతో హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. వారం రోజుల పాటు "క్వింటెన్ తిన్నాడా? ఎక్కడున్నాడు? కిందకి వచ్చినట్టు లేదేంటి?" అని దగ్గరుండి

చిన్నపిల్లాడిలా చూసుకున్నారు, తన కుటుంబ సభ్యులకి ఆపదవస్తే కాపాడేందుకు సాయిశక్తులా ప్రయత్నించి, కోలుకునేంతవరకూ అవసరాలను చూసే తత్వం మా నాన్నది - అది మనిషైనా పిల్లైనా..

చిన్నతనంలో మా అమ్మ పెంపుడు కుక్క, రాము లారీకిందపడి చనిపోవడంతో ఆ బాధ భరించలేక 'జన్మలో దేన్నీ పెంచకూడదు' అని అనుకుంది. "పిల్లి, కుక్క అస్సలిష్టంలేదు" అని పదే పదే చెప్పినా క్వింటన్‌కి ఒంట్లో బావుండనప్పుడు దాదాపు ఏడ్చినంత పనిచేసింది. పైకి గంభీరంగా కనబడినా లోపల ప్రేమని ఎవరు దాచగలరు? మా నాన్న చిన్నతనంలో తాతయ్య స్నేహితుడు విజయవాడ ఇన్‌కంటాక్స్ కమీషనర్‌గా పనిచేసేవారట. ఆయన పెంచే ఆల్సేషన్‌కి ముగ్గురు పిల్లలు పుట్టారని, వాటిలో ఒకటి తీసుకోమని చెప్పారట. ఆ సంగతి తెలిసి ఇంట్లోని తొమ్మిదిమంది పిల్లలు కుక్కని తెమ్మని గొడవచేసారట. కానీ పెట్స్‌ని ఇష్టపడకపోవడంతో "కుక్కని ఇంటికి తెస్తే అది ఒక్కరికే పెట్ అవుతుంది. అప్పుడు కిష్టప్ప "బైట్ శ్యామలా" అనో, ప్రమీల "బైట్ లీల" అనో ట్రైయిన్ చేస్తారు. అందుకని కుక్క వద్దు" అని అన్నారట. అదే హ్యూమర్ మా నాన్నకి వచ్చింది. పెట్స్‌లో ఎలాంటి అనుభవం లేకపోయినా స్కాచ్‌కి చాలా త్వరగా అలవాటుపడిపోయారు మా నాన్న. మేము పనిలోపడి పట్టిచ్చుకోని సమయంలో మా నాన్న స్కాచ్‌తో ఆడుకోవడం చూసి మేమందరం నమ్మలేకపోయాం. పియోరియాలో కొన్నిరోజులుండి ఇండియానాకి తిరిగి వచ్చాక స్కాచ్ మా నాన్న చుట్టూ తిరగడం చాలా ముచ్చటేసేది. కానీ మొదట్లో క్విన్‌టెన్‌కు మాత్రం భయపడ్డారు.

రాత్రిళ్ళు పడుకోబోయేముందు వీధి కుక్కలు తినడానికి ఏదో ఒకటి పెట్టడం, ఉదయాన్నే పక్షులకు గింజలు వేయడం, పంజరంలోని పక్షులను తెచ్చి విడుదల చేయడంలాంటి అలవాట్లు మా నాన్నకి ఉన్నాయి. అవే నాకు అబ్బాయి. ఒకసారి ఎవరో పెళ్ళిలో ఒక పిల్లి చాలా ఆకలిగా ఉన్నట్టు కనబడింది. అందుకని నేను దానికి ఐస్క్రీంని పెట్టడం చూసి మా చుట్టాలు నవ్వారు.

"ఐస్క్రీంలో కూడా పాలుంటాయిగా" అని నేను చెప్పాను. ఊహ మా చుట్టాలతో కలిసి హేళన చేసినా, "పిల్లులు వాటి ఆహారాన్ని అవే సంపాదిస్తాయి, మనుషులు అవసరంలేదు" అని మా అమ్మ చెప్పినా, మా నాన్న మాత్రం "మంచిపనే చేసాను" అని అన్నారు. మంచిపని చేసినప్పుడు నలుగురు ఏమనుకుంటారు అని ఆలోచించకూడదు, ఆ పని మొదలుపెట్టాక సగంలో ఆపకూడదు అని మా నాన్న నాకు నేర్పారు.

నేను ఎనిమిదవ తరగతిలో ఉన్నప్పుడు 'వినీలాకాశంలో వింత కథలు' అనే పుస్తకాన్ని చదివి ప్రతీజీవికి గౌరవం ఇవ్వాలని తెలుసుకుని అందరినీ, అన్నిటినీ 'గారు' అని సంభోదించడం మొదలు పెట్టాను. మా అక్కయ్యలతో మాట్లాడుతూ "దానిమీద దోమగారు వాలారు" అనో "పిల్లిగారు కనిపించారా?" అనో అంటే ఏడిపించేవారు. "బయటవాళ్ళు వింటే పిచ్చనుకుంటారు" అని మా అమ్మ నవ్వేది. కానీ మా నాన్న ఏనాడూ నన్ను ఆపలేదు. ప్రతీజీవికి మర్యాదని మాటల్లోనేకాక చేతల్లో, ఆలోచనల్లో కూడా చూపాలి అని మా నాన్నను చూసి తెలుసుకున్నాను.

పెట్స్ విషయంలో నాకు బాగా నవ్వొచ్చే జ్ఞాపకం ఒకటి ఉంది. నేను హైదరాబాద్‌లో ఉన్నప్పుడు నా ఫ్రెండ్ తన కుక్కని తీసుకుని సాయంత్రాలు మా ఇంటికి వచ్చేది. ఒకరోజు ఎందుకో దాన్ని బయట కట్టేసాము. చీకటి పడేసమయానికి ఆ కుక్క అరవడం మొదలు పెట్టింది. "ఫిడోని లోపలికి తీసుకొద్దామా? బాగా అరుస్తున్నాడు" అని నా ఫ్రెండ్‌తో అన్నాను.

"ఫరవాలేదు. కొంచెం సేపు అరిచి ఆపేస్తాడు" అని తను చెప్పింది. ఎంతసేపటికీ అరుపులు ఆపకపోవడంతో మా నాన్న అమ్మతో "పద్మా, ఆ కుక్క ఇందాకటినుంచి అరుస్తూనే ఉంది. ఏమైనా కావాలేమో చూడు" అన్నారు.

"అది కుక్క. మనిషనుకుంటున్నారా ఏం కావాలో చెప్పడానికి?" అని మా అమ్మ బదులిచ్చింది.

"నీళ్ళు కావాలేమో" అని మా నాన్న నీళ్ళతో బయటికి వెళ్ళడం గమనించి మేము కుక్కని తిరిగి ఇంట్లోకి తీసుకు వచ్చాము. మా నాన్న ప్రశ్నని తలచుకుని నేను చాలారోజులు నవ్వాను. జంతువుల్లో, మనుషుల్లో ఉండేది ఆత్మే. దేహం కేవలం బయట రూపం మాత్రమే

అని నమ్మే మా నాన్న వాటిని సమానంగా చూస్తారు. మా నాన్న చెప్పే ప్రతీ సూక్తి ఆయన ఆచరించేదే కబుర్లు చెప్పి పాఠించని వాళ్ళని చూసినప్పుడు మా నాన్న పట్ల గర్వం, గౌరవం పెరుగుతూ వచ్చింది. అది ఏ స్థాయి చేరిందంటే  మా నాన్న అన్నారు అంటే అది ఖచ్చితంగా కరెక్టే అని నేను నమ్మే అంత. ఈ విషయాలు చాలా మందికి అతిశయోక్తిగా అనిపించొచ్చు. కానీ ఇవే నేను ఆచరించే సూత్రాలు.

(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)

Click here to share your comments on this story